




గత పది సంవత్సరాలుగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాదిమంది తెలుగువారిని అలరిస్తున్న కిరణ్ ప్రభ టాక్ షోలు, యు ట్యూబ్లో 900 పైగా ఉన్న విషయం కౌముది పాఠకులకు తెలుసనే అనుకుంటున్నాము. కొంతమంది పాఠకులు ఆ టాక్ షోలకు అక్షరరూపం ఇస్తే బాగుంటుందని అడుగుతున్నారు. వారి సూచనలమేరకు ఆ టాక్ షోల నుంచి ఎంపికచేసిన కొన్నింటిని నెలనెలా ఇలా అక్షరరూపంలో మీకందిస్తున్నాము.

# చలం జీవితం – సాహిత్యం

## -11-

"నేను గర్విష్టి ననీ, మాట్లడననీ, సిన్సియర్ గా కంప్లయింట్ చేసేవారికి చెబుతున్నాను. మాట్లాడడానికి వేరే వాళ్ళు నాదగ్గరకు వస్తుంటే, నా మీద స్కాండ లైజ్ చేసేవాళ్ళ కోసం కాదు. నేనెందుకు మాట్లాడనంటే, నిజం మాట్లడనేమోననే భయం వల్ల. నా అబద్దం నాకు హాని చేసినా ఫరవాలేదు. ఇతరులకు హాని చేస్తుందేమో నని నా భయం. పైగా నేను తక్కువగా మాట్లాడితే, ఎదుటివాళ్లకు ఎక్కువ ఆలోచించుకునే అవకాశం వుంటుంది.'అని ఒక అభిప్రాయం. ఇంకో విశేషం ఏమిటంటే, ఏదైనా సరే, ఇదే సరైన మార్గం అని గట్టిగా చెప్పడానికి నాకు ఏ అధికారమూ లేదు. ఎవరి అభిప్రాయాలు వారికి వుంటాయి. ఎవరి స్వేచ్ఛ వారికి వుంటుంది. దాని మీద నాకు గౌరవం వుంది. అలాగే ఏ మార్గం అయినా గానీ, కొంత వరకూ సూచనలు ఇవ్వడానికే. నాకు గానీ, ఇంకెవరికి గానీ, సరిగ్గా సరిపోదు అని తెలియడం వల్ల కూడా తక్కువ మాట్లాడుతున్నాను. ప్రజలందరికీ ఈ మార్గం మంచిది అని రాయడం ఒకటి. ప్రత్యేకం ఒకళ్ళ తోటి "ఇది నీకు మంచిది" అని చెప్పడం. ఈ రెండూ వేరువేరు సంగతులు. వచ్చిన ఖర్మం ఏమిటంటే, నాకు సంఘం మీద కోపం. వ్యక్తుల మీద ఇష్టం. సంఘం అంటే, నాతో కూడా కలుపుకొని నా కన్నా, చాలామంది కన్నా బుద్ధి హీనమైనది. వ్యక్తులు

నాకన్నా గొప్పవారూ లేరు. నా కన్నా హీరోలూ లేరు. నా ముఖ్యంగా "స్త్రీ" చదివి చెడిపోయిన వారున్నారని, చాలామంది ఉద్దేశ్యం లాగ కనపడుతుంది. చెడిపోవడం అంటే ఏమిటి? ఆ మాట అట్లా వుంచి, ఆ చెడిపోయిన వాళ్ళు ఒక్కరు కూడా నా కంటబడలేదు. ప్రస్తుతం ఏ మొహమూ, ఆకర్షణా లేకుండా అలవాటు ప్రకారం నిష్కామ కర్మ చేసే ఈ సంసారుల కంటే, చెడిపోవడం అనేది యెట్లా సంభవమో యెంత ఆలోచించినా నా మనసుకు అందడం లేదు. ప్రత్యేకించి ఈ పుణ్యలోకంలో నా ఒక్కడిదే పాపిష్టి మనసు అనుకుంటారేమో. అట్లా నా పుస్తకాలు చదివి చెడిపోయిన వాళ్ళే వుంటే, వాళ్ళందరూ బాగుపడ్డారని నా ఉద్దేశ్యం. ప్రపంచం అంతా ఇట్లా తమ కళ్ళ ముందు ఇది వరకు మారదు అని అనుకున్న దాని కన్నా చాలా ఎక్కువగా మారిపోతుంటే, దేశాలకి దేశాలు కొట్టుకు పోతూ వుంటే, ఇంకా పసుపు పారాణిల కోసమూ, అంటు తపేలాల మీద మెతుకుల కోసమూ, సిగ్గు బిడియాల కోసమూ, గింజుకు లాడే ముసలి అత్తల్ని, శీల అశ్లీలత కోసమూ, తెలుగు కధకుల్నీ, బడి పంతుళ్ళనీ, పత్రికా విమర్శకుల్నీ చూస్తే, నవ్వు వస్తుంది. దిగులేస్తుంది. పత్రిక కొనే ప్రతి మనిషీ మీరు అనుకునే అవినీతి కథల కోసమే కొంటున్నాడు. తెలుగు వాళ్ళలో చదువు వచ్చిన వాళ్ళంతా అవినీతిపరుల్లాగే ఉన్నారు. ఇలా అనుకుంటే, ఈ విమర్శకులు మాత్రం, ఆకథల్నే ఆరు సార్లు చదివి, 'అవినీతి కథలు' అని పత్రికల్లో మళ్ళీ మళ్ళీ రాస్తున్నారు. ఏం చేస్తాం ఈ మ్యూజియం వస్తువులు పదేళ్ళలో మరీ అపురూపం అయిపోతాయి. చూసి నవ్వేందుకు ఎవరూ వుండరేమో! అనే దిగులుతో ఇంకో పదేళ్ళ పాటు మా ఆహ్లాదం కోసం బతకమని దీవిద్దాం"

ఈ మాటలన్నీ చలం గారు 1940 లో 'స్త్రీ' పుస్తకం 3 వ ముద్రణ సందర్భంలో కొత్త ముందుమాటలో రాసినవి. ఇప్పుడు మన మాటల్లో చలం గారి గురించి చెప్పుకుందాం.

తరతరాల నీతి సూత్రాలకు కొత్త నిర్వచనం చెప్పిన వాడు. సాంప్రదాయ సంకెళ్ళను తునాతునకలుగా చెయ్యాలని ప్రచారం చేసిన వాడు, చేసి చూపించిన వాడు, తన విశ్వాసాలను ప్రచారం చెయ్యడానికి రచనలను భీషణాయుధాలుగా మలచుకున్న వాడు. రాసిన ప్రతి వాక్యాన్ని తుపాకీ తూటాలాగా పేల్చగలిగినవాడు. 56 సంవత్సరాల పాటు తన జీవితాన్ని సంకుల సమరంలాగ సాగించి, ఆ పై మరి కొన్ని సంవత్సరాలు మౌన ముద్రలో మునిగిన వాడు. ఆంధ్రదేశంలో వెలిగించిన కాగడాను అరుణాచలంలో కొండెక్కించిన వాడు చలం. గుడిపాటి వెంకట చలం... తరువాత అధ్యాయం...

చలం గారు గుడివాడను కేంద్ర బిందువుగా చేసుకొని, ఆ చుట్టుపక్కల స్కూళ్ళకు వెళుతూ, వస్తూ వుండేవారు. ఒకసారి గుడివాడ దగ్గరలో పామర్రు అనే వూరు వెళ్లారు. ఆ పామర్రు దగ్గరలోనే 'కురుమద్దాల' అనే మరో చిన్న వూరు వుంది. అక్కడ 'మాల పిచ్చమ్మ' అనే ఒకామె వుందని అక్కడి వాళ్ళు చెప్పారు. ఆ మాల పిచ్చమ్మ ఎవరంటే...?

ఆమె వయసు అరవై సంవత్సరాలు వుంటుంది. నల్లగా, పొడవుగా వుండేది. ఆవిడ దైవాంశ సంభూతురాలు అని ఆ వూర్లో వాళ్ళు నమ్ముతుంటారు. ఊరి బయట ఒక పూరి గుడిసెలో వుంటుంది. చాలా సార్లు నగ్నంగా, ఒక్కోసారి కంబళి కప్పుకొని వుండేది. ఆవిడను ఎవరైనా ప్రశ్నలు అడిగితే, ఆమె చెప్పినటువంటి సమాధానాలు నిజం అవుతాయని ఆ

వూరి వాళ్ళ నమ్మకం. కాకపోతే ఆమె ఎక్కువగా సైగలే చేసేది. తక్కువగా మాట్లాడేది. అక్కడి వాళ్లు ఆ సైగల్ని తర్జుమా చేసి చెప్పేవారు. ఆవిడ జీవన విధానం ఏమిటంటే...ఎక్కువగా ఎవరు ఏమి ఇచ్చినా తినేది కాదు. రెండు రోజుల పాటు ఒక గదిలో ధ్యానంలో వుండేది. మధ్యలో ఒకరోజు మాత్రం వచ్చిన వాళ్లకు దర్శనం ఇవ్వడం, వాళ్ళు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పడం ఇలాంటివి చేస్తుండేది.

అసలు ఆ మాల పిచ్చమ్మ అలా ఎందుకు అయ్యింది అంటే, ఏవేవో కథలు చెబుతారు. వాళ్ళ అమ్మాయికి చిన్నతనంలోనే పెళ్ళవడం, ఆమె అత్తవారింటిలో ఆత్మహత్య చేసుకోవడం, ఆ తర్వాత ఈమె ఏదో సాధన చెయ్యడం వలన ఈమెకు అతీత శక్తులు వచ్చాయని వూర్లో వాళ్ళ నమ్మకం. ఇది ఆ మాల పిచ్చమ్మ నేపథ్యం. ఈ మాల పిచ్చమ్మ గురించి చలంగారికి ఎవరో చెప్పారు.

చలం గారి అప్పటి మానసిక స్థితి ఎలా వుందంటే – రమణ మహర్షి వైపు కొంచెం కొంచెంగా ఆకర్షింప బడుతున్నారు. అంత వరకూ ఉన్నటువంటి పాక్షిక నాస్తిక భావాలనుండి బయటకు వస్తున్నారు. ఆ సమయంలో వూర్లో వాళ్ళు చెప్పిన మీదట, 'అసలు ఈవిడ ఎవరో చూద్దాం' అనుకోని ఆ మాల పిచ్చమ్మ దగ్గరకు వెళ్లారు. అది ఆమె సమాధిలో వుండే రోజు. అక్కడ ఎవరో ఒక అమ్మాయి వుంటే అడిగారు. ఆ అమ్మాయి "ఆమె సమాధిలో వున్నారు రేపు గానీ బయటకు రారు" అంది గానీ, అంతలోనే చలంగారు స్కూళ్ళ ఇనస్పెక్టర్ అని తెలిసి, తలుపు తీసి, "లోనికి వెళ్ళండి." అంది. లోనికి వెళ్లారు. లోపల వెలుతురు వచ్చీ రానట్లుగా వుంది. మాల పిచ్చమ్మ అక్కడ కూర్చొని ధ్యానం చేసుకుంటున్నది. ఎప్పుడూ ఎవరూ రారు. ఇప్పుడెవరొచ్చారా అని, ఆమె బలవంతంగా కళ్ళు తెరిచింది. చలం గారిని చూడగానే కూర్చోమని సైగ చేసింది. కాసేపు అతని కళ్ళలోకి తీవ్రంగా చూసి, ఒక చెయ్యి అతని గుండెల మీద పెట్టడానికి ప్రయత్నించింది. ఆయన జేబులో వున్న కళ్ళ జోడూ, డబ్బులూ యేవో తగిలాయి. చెయ్యి వెనక్కి తీసేసుకుంది. ఒక్కసారి ఆమె చెయ్యి గుండెలమీద పడగానే, ఆయన...'కాళ్ళనుండి శరీరం అంతా విద్యుల్లతలు పాకుతున్నట్లూ,రక్తం అంతా తలలోకి చేరుతున్నట్లూ, చెవుల్లో పెద్ద హోరు' ఇలాంటి అనుభూతికి లోనయ్యారు. అలా ఒక గంట సేపు కూర్చున్నారు. వెళ్ళిపోవడానికి లేచినపుడు, సైగ చేసిందట.."నీ కళ్ళ మధ్యలో ఏమైనావెలుగు కనబడిందా?"అని. ఆయన దానికి అవునూ, కాదూ అన్నట్లుగా తలూపారు. మరి కొంచెం సేపు కూర్చొని బయటకు వచ్చేశారు.

అక్కడ నుండి ఇన్స్పెక్షన్ కోసం స్కూలుకి వెళ్లారు. వెళ్లి కలం పుచ్చుకొని రాయబోతుంటే, వేళ్ళ మధ్య కలం నిలవడం లేదు. ఒళ్ళంతా వణికి పోతోంది. తరువాత అద్దంలో చూసుకుంటే, ముఖం అంతా ఎర్రగా అయిపోయింది. ఏదో ఆయనకు తెలియనటువంటి అనుభవం, ఏదో శక్తి తనలోకి ప్రవేశించింది అనుకున్నారు. ఈ సన్నివేశం గురించి మిత్రులకు రాసిన ఉత్తరాల్లో..."ఈ అనుభవం వల్ల నాకు లాభం కలిగినా, కలగక పోయినా ఇప్పుడు నిశ్చయంగా జరిగిన విషయం ఒకటి నా అనుభవం లోకి వచ్చింది. ఇతరులకు ఈ ఆధ్యాత్మికతంతా ఉత్త మోసం అన్నప్పుడు,

ఔన్నత్యాన్నిపొందిన మనుష్యులు ఇతరులలో ఎలాంటి అద్భుతమైన మార్పుని తీసుకురాగలరో, స్వానుభవం మీద నేను చూశాను. కానీ, ఎవరిక్కావాలి? ఎవరు అన్వేషిస్తారు? రేషనిలిస్ట్, మూఢనమ్మకాలకు లొంగిపోయాడని నన్నే నిందిస్తారు. మళ్ళీ ఆమె అనుగ్రహం నాపైకి ఎప్పుడు ప్రసరిస్తుందో? ఇట్లా 2,3 సార్లు నాలో శక్తిని విజృంభింపజేస్తే, ఇంతకంటే నాకింకేం కావాలి? కానీ, ఆమెను నేను అడగదలచుకోలేదు. నా అధికారులు నన్ను బాధిస్తుంటారని కూడా ఆమెతో చెప్పలేను. ఎందుకంటే, ఆమె మనసులోనైనా నా అధికారులకు కీడు శంకిస్తారేమోనని...” ఇలాంటి అనుభవానికీ, అనుభూతికీ లోనయిన చలం గారు బెజవాడ వెళ్ళినపుడు, వాళ్ళ పెద్దమ్మాయి సౌరీస్ కూడా రమణ మహర్షి చెప్పిన ధ్యానాన్ని తండ్రితో పాటు కూర్చొని అభ్యసిస్తూనే వున్నారు.

ఒకసారి “మాల పిచ్చమ్మ దగ్గరకు వెళ్లాను. నాకు ఏదో కొత్త అనుభవం కలిగింది. నువ్వు కూడా రామ్మా వెళదాం”అన్నారు. అయితే, సౌరీస్, భార్యా రంగనాయకమ్మ గారూ ఎప్పటినుండో అరుణా చలం తీసుకువెళ్ళమని అడుగుతున్నారు. “దానికి సమయం రాలేదు. ప్రస్తుతానికి కురుమద్దాల వెళదాం”అని సౌరీస్ ను కురుమద్దాల తీసుకువెళ్ళారు. మధ్యలో సౌరీస్ అడిగింది”ఎందుకు నాన్నగారూ!మనం ఎలాగూ రమణ మహర్షి దగ్గరకు వెళతాం కదా! మధ్యలో ఈ చిన్న చిన్న స్వామీజీలూ, యోగినీలు ఎందుకు” అంది. అంటే, ఆయన అన్నారు

“నాకేదో అనుభూతి కలిగింది. నేను బాధపడె మైగ్రేన్, నీకూ ఉంది కదా! నువ్వు కూడా ఒకసారి చూద్దువుగాని రా!”అని ఆమెను ఒప్పించి, ఆ మాల పిచ్చమ్మ దగ్గరకు తీసుకువెళ్ళారు. వాళ్ళని చూడగానే ఆ మాల పిచ్చమ్మ గారు సైగలతోనో, చిన్నపాటి మాటలతోనో చెప్పారు ”ఈ అమ్మాయి మీ అమ్మాయే కదా! నీ కడుపున పుట్టడం నీకు చాలా అదృష్టం.ఈమె మామూలు మనిషికాదు. ఈవిడ తొందరలోనే యోగినీ అయిపోతుంది.వివాహం మాత్రం చేసుకోదు. ఈమెను ఇప్పుడే ఏదైనా ఆశ్రమానికి పంపించెయ్యండి. మీరు యెంత దగ్గరగా వున్నా , మరొక 4 సంవత్సరాలు మాత్రమే. మీకూ, నాకూ ఈ బంధం.” అంది. ఆమె ఎందుకలా అన్నదో వాళ్లకి అర్థం కాలేదు. అక్కడే కాసేపు కూర్చుని, వచ్చేశారు.

ఆ తరువాత చలం గారు ‘కురమద్దాల’ వెళ్ళినప్పుడల్లా ఆ మాల పిచ్చమ్మను చూస్తుండేవారు. ఆయనకేదో ఉపశమనం,అనుభూతి కలుగుతుండేవి. విచిత్రంగా 4 సంవత్సరాల తర్వాత, దగ్గర్లోనే బెజవాడలోనే ఉన్నప్పటికీ, మళ్ళీ ఎప్పుడూ ఆ మాల పిచ్చమ్మను కలుసుకోలేదు. ఆ తర్వాత ఆ మాల పిచ్చమ్మ చనిపోయింది. చలం గారికి ఇదొక అనుభవం, రమణ మహర్షి దగ్గరకు వెళ్లి వస్తున్నరోజుల్లోనే. అంటే, మామూలు వ్యక్తులకు కూడా మానవాతీత శక్తులు ఉంటాయని ఆయన భావం బలపడడానికి ఈ మాల పిచ్చమ్మ ఉదంతం దోహదం చేసిందని అనుకోవాలి.

ఆ తరువాత కొన్ని నెలలకి భార్యనీ, సౌరీస్ నీ తీసుకొని ఆయన అరుణాచలం వెళ్లారు. మొట్ట మొదటి దర్శనం తోనే సౌరీస్ కి భగవాన్ పట్ల విపరీతమైన ఆరాధనా భావం కలిగింది. అలాగే ఆ భగవాన్ మహర్షి దగ్గర కూర్చోగానే,

ఆమెకు ఏదో సమాధి స్థితికి వెళ్లి నట్లుగా అనిపించింది. అంతకుముందు నుండే ఆమె రమణ మహర్షి చెప్పిన ధ్యానం చేస్తుండేవారు. కాబట్టి, చాలా తొందరలోనే మహర్షి మీద పూర్తి విశ్వాసం ఏర్పడింది. ఆ తరువాత చలం గారు ఒక్కరే రెండు, మూడు సార్లు వెళ్ళడం, ఇంకోసారి కుటుంబ సభ్యుల్ని తీసుకువెళ్ళడం, మధ్యలో మాల పిచ్చమ్మను కలవడం ఇదంతా 36 నుండి 40 వరకూ అంటే ఒక 4 సంవత్సరాలు పాటు జరిగింది. 1940 వచ్చేసరికి చలం గారికి రమణ మహర్షి అంటే, పూర్తి విశ్వాసం ఏర్పడడమే కాకుండా, అతనికి చాలా సన్నిహితం అయిపోయారు. యెంత సన్నిహితం అయిపోయరంటే, చింతా దీక్షితులు గారు ఎప్పుడు వెళ్ళినా " దీక్షితులు గారూ! నాన్నగారు వచ్చారా?" అని అడిగేవారట. ఆ రమణ మహర్షి గారు "నాన్న గారూ" అని ఇద్దర్ని మాత్రమే సంబోధించేవారట. ఒకరు "గణపతి శాస్త్రి" గారూ, రెండోది మన చలం గారిని. ఆ తరువాత చలంగారు మరో రెండు సంవత్సరాలకి "భగవాన్ పాదాల ముందు చలం", యశోదా గీతాలు"అనే పుస్తకాలు రాశారు. అప్పటికి చలం గారు గుడివాడలోనే వుద్యోగం చేస్తున్నారు. కుటుంబం, పిల్లలూ బెజవాడలో వున్నారు.

అదే రోజుల్లో "మ్యూజింగ్స్"అనే కొత్త సాహిత్య ప్రక్రియను రాయడం ప్రారంభించారు. ఇది తెలుగు సాహిత్యం లోనే కొత్తది. "మ్యూజింగ్స్"అంటే..'అంతరంగ తరంగాలు,' 'మనసులో అప్పటి కప్పుడు కలిగేటటు వంటి భావాలు,' 'మనసులోని మాట' 'అంతర్వాహిని' అలా ఎన్నయినా అనుకోవచ్చు. ఆ చిన్న చిన్న వ్యాసాలు "మ్యూజింగ్స్"అనే పేరుతో రాసి పత్రికలకు పంపిస్తుండేవారు. ఆ ప్రక్రియ మరో 15 సంవత్సరాలు కొనసాగింది. అది 1950 తర్వాత పుస్తకరూపంలో వచ్చింది. ఆ సంవత్సరాల్లోనే ఇంకో విశేషం ఏమిటంటే...

చలంగారు రాసిన కథ ఆధారంగా "మాలపిల్ల" సినిమావిడుదలయ్యింది. మరి చలం గారు ఇన్ని కథలూ, వ్యాసాలూ, నాటకాలూ రాస్తుండేవారు. పత్రికలకు పంపిస్తుండేవారు. చాలా పత్రికలు వేస్తుండేవి. కొన్ని పత్రికలు బహిష్కరిస్తుండేవి. అలాంటప్పుడు పత్రికల నుండి పారితోషికం వస్తుండాలి కదా! నిజానికి అవేవీ వచ్చేవి కాదు. .ఎందుకంటే?ఏ పత్రిక్కి రచన పంపినా, ఎవరినీ పారితోషికం అడిగేవారు కాదు. పారితోషకం కోసం పంపించేవారు కాదు. ఆయన మొట్ట మొదటిసారిగా పారితోషకం తీసుకున్నది "మాల పిల్ల" సినిమాకు కథ రాసినందుకు.

ఈ రోజుల్లోనే ఇంకొక పరిణామం – బెజవాడలో ఉంటున్న ఇంటిఓనర్ "ఇల్లు బాగుచేయించాలి. ఖాళీ చెయ్య" మన్నాడు. అలా అనడంతో "లక్ష్మి టాకీస్"పక్కనే ఉన్నటువంటి 3 అంతస్తుల భవనం లోకి మారారు. అప్పటికి డాక్టర్ గారికి ఆదాయం బాగానే వస్తున్నది. పెద్ద ఇల్లు తీసుకోవడానికి వాళ్లకు పెద్ద ఇబ్బంది ఏమీలేదు. ఆ 3 అంతస్తుల భవనంలో కింద అంతా ప్రాక్టీస్ వుండేది. మధ్య అంతస్తులో హాలు భాగం ఖాళీగా వుండేది. ఇది 1940లో చలం గారి కుటుంబ పరిస్థితి. ఈ కథను ఇక్కడ కొంచెం ఆపి, కాస్త వెనక్కివెళ్లి, పిల్లల చదువులు ఎలా వున్నాయో చూద్దాం.

ఎందుకంటే, చలంగారి జీవితం మీద, కుటుంబ సభ్యులు, అత్యంత శక్తి వంతమైన ప్రభావం చూపించారు. వాళ్ళ వల్ల కూడా చలం గారి జీవితం అనేక మలుపులు తిరిగింది. ఒక్కసారి పిల్లలగురించి చూద్దాం.

పెద్దబ్బాయి 'రవి' మరణించాడు. పెద్దమ్మాయి 'సౌరీస్', రెండో అబ్బాయి 'వసంత్', రెండో అమ్మాయి 'నిర్మల' మూడవ అమ్మాయి 'పకపక'. అలాగే వాళ్ళు పెంచుకున్న అనాధ బాలిక 'చిత్ర', అలాగే వాళ్ళ కుటుంబంలోకి వచ్చిన 'నర్తకి' వీళ్ళందరూ కూడా బెజవాడ డాక్టర్ గారి ఇంట్లోనే వుంటున్నారు. పెద్ద పిల్లలు సౌరీస్, వసంత్, నిర్మల, వీళ్ల ముగ్గుర్నీ 35, 36 ప్రాంతాల్లో కాన్వెంట్లో చేర్పించారు. కొన్నాళ్ళ తర్వాత, "రుషి వేలీ"కి పంపించారు. అక్కడో రెండేళ్ళు చదువుకున్నారు. ఆరోగ్య సమస్యలు తలెత్తడం తో మళ్ళీ, బెజవాడ తీసుకువచ్చేసి, ట్యూషన్ పెట్టించారు. డబ్బులున్నాయి కాబట్టీ, పెద్దగా ఆర్ధిక ఇబ్బందులు ఏమీ లేదు.

అయితే, సౌరీస్ మాత్రం "నాకు చదువు మీద ఆసక్తి లేదు. మానేస్తాను"అని చెప్పి, మానేసింది కూడాను. సరిగ్గా అదే సమయంలో చలం గారితో కలసి, ఈ ధ్యానం, సాధనా ఇలా ఆధ్యాత్మిక భావాల వైపు మొగ్గు చూపడం ఇవన్నీ జరిగాయి. పెద్దమ్మాయి చదువు మానేసి, ఇంట్లో వుండేసరికి వాళ్ళ అమ్మగారికి దిగులు పట్టుకుంది. 20 సంవత్సరాలు కూడా నిండలేదు. అమ్మాయి యేమయిపోతుందోనని. డాక్టర్ రంగనాయకమ్మ గారు ధైర్యం చెప్పారు. "నువ్వు బాధ పడకు చెల్లీ! నేను ఒక పని చేస్తాను"అని ఈ సౌరీస్ ని తనదగ్గర సహాయకురాలిగా పెట్టుకున్నారు. డాక్టర్ గారికి సహాయం, వచ్చే రోగులకు సేవ చెయ్యడం, వారు చెప్పే కథలు వినడం చేసేవారు సౌరీస్. వాళ్ళ బాధలు విన్నాక, జీవితం అంటే ఇంతేనా, ఇన్ని కష్టాలు వుంటాయా అనకొని సౌరీస్ కి మరింతగా ఆధ్యాత్మిక భావాలు పెరిగాయి. అదే రోజుల్లో తండ్రి లాగ, సౌరీస్ కూడా రచనలు చెయ్యడం కూడా ప్రారంభించింది. ఎక్కువగా "భగవాన్ నా కలలో కనిపించాడు. ఇలా చెయ్యమన్నాడు. అలా చెయ్యమన్నాడు" అంటుండేది.

ఆరోజుల్లోనే సౌరీస్ "జీవన రాగం" అని ఒక నవల రాశారు. రాత్రి పూట కలలు వస్తాయని, కలలోని పాత్రలతో మాట్లాడతాననీ భావిస్తూ, రాత్రి పడుకునే ముందు పెన్నూ, పుస్తకం తల దగ్గర పెట్టుకొని, మధ్యమధ్యలో లేచి రాసేదట. అలా ఆ నవలలో చాలా భాగం కలలో వచ్చినవే రాశానని ఆ తర్వాత సౌరీస్ చెప్పుకున్నారు.

1936– 40 మధ్యలో సౌరీస్ సినిమా ప్రయత్నాలు కూడా చేసింది. సౌరీస్, నిర్మల ఇద్దరూ చాలా అందంగా వుండేవారు. విశాఖపట్నంలో ఏదో సినిమా కంపెనీ వాళ్ళు, సినిమా ప్రారంభిస్తూ నటీనటుల్ని ఎంచుకుంటామని బెజవాడ వచ్చారు. ఆ విషయం సౌరీస్ కు తెలిసింది. "సినిమాలోకి వెళ్తాను" అంటే డాక్టర్ గారు కారేసుకొని మరీ తీసుకువెళ్ళారు. వాళ్ళేదో హార్మోనియం ఇచ్చి, పాటలు పాడమన్నారు. కెమెరాతో ఫోటోలు కూడా తీసుకున్నారు. ఆ వాతావరణం అంతా చూసాక సౌరీస్ కి అనిపించిందట. 'ఇలాంటి వాళ్ళ మధ్యన వుండి, సినిమాల్లో వెయ్యడం కంటే, ఎవరో ఒకర్ని పెళ్లి చేసుకొని , బానిసగా బ్రతకడం మంచిది' అని. అలా అనుకొని అక్కడ్నుంచీ వచ్చేశారు.

ఇక మిగిలిన ఇద్దరూ.. నిర్మలా, వసంత్. వీళ్ళు డాక్టర్ గారు చెప్పినట్టు ట్యూషన్ చదువుకుంటున్నారు. వసంత్ కు ఏమైందంటే, ఎస్సెల్సీ తప్పాడు. "నాకు చదువు మీద ఆసక్తి లేదు. మానేస్తాను" అన్నాడు. డాక్టర్ గారికి వసంత్ చాలా చేరిక. ఇతనికి 4,5, సంవత్సరాలు వున్నప్పుడు ఈమె హైదరాబాద్లో డాక్టర్ కోర్సు చదువుతున్నప్పుడు, ఈ కుర్రవాడ్ని తన దగ్గర వుంచుకొని కాన్వెంట్ కి పంపిస్తుండేవారు. అందువల్ల తల్లి దగ్గర కన్నా, పెద్దమ్మ దగ్గర చాలా చేరికగా ఉండేవాడు. వసంత్ చదువు మానేస్తానని చెప్పగానే, డాక్టర్ గారికి చాలా బాధ కలిగింది. అంతేకాకుండా, ఊర్లోకి వెళ్లి అల్లర్లు చెయ్యడం, పెద్ద పెద్ద వాళ్ళ పిల్లలతో స్నేహాలు చెయ్యడం చేసేవాడు. ఒకరోజు చలం గారితో మాట్లాడింది "వెంకట చలం ! ఏం చేద్దాం. బెజవాడలో వుంటే, చెడిపోతాడు."అన్నారు డాక్టర్ గారు..

అప్పుడు వసంత్ ని మద్రాస్ "అడయార్"లో ఒక స్కూల్లో చేర్పించారు. ఆ కుర్రవాడికి చెప్పారు"అబ్బాయ్! నువ్వు యెంత చదువుకుంటావో అంత చదువుకో. నీకు కావలిసిన డబ్బులు పంపిస్తాం. నీకు 18 సంవత్సరాలు వచ్చాయి. నీ జీవితం నీది. నువ్వు ఏం చెయ్యాలో నువ్వే నిర్ణయించుకో."అని ఆ స్కూల్లో పెట్టి, ఆ స్కూలు వాళ్లకి నెలకి ఇంత అని పంపిస్తుండేవారు.

అసలు మద్రాస్ లో వసంత్ ని పెట్టడానికి ఇంకో కారణం వుంది. చలం గారి తమ్ముడు వెంకట రామయ్య గారు అక్కడే వున్నారు. అతను మనం మాట్లాడుకునే కాలానికి 20 సంవత్సరాలకు ముందే అక్కడ ఒక పుస్తక ప్రచురణ ప్రారంభించారు. [ఇతను కొమ్మూరి సాంబశివరావు గారి నాన్నగారు] అంతే కాకుండా, మరి కొంతమంది బంధువులు కూడా అక్కడే వున్నారు. అందుకనే అక్కడ చేర్పించారు.

ఒకసారి ఆ స్కూలు ప్రిన్సిపాల్ చలం గారిని రమ్మనమని కబురు పంపించాడు. చలం గారు అరుణాచలం వెళ్ళేటప్పుడు, ఆ వసంత్ చదువుకునే స్కూలుకి వెళ్లారు. ఆ ప్రిన్సిపాల్ చెప్పాడట "మీ పిల్లవాడు చాలా చురుకైన వాడు. అంతేకాదు, మామూలు చదువే కాకుండా, చాలా ఆర్టిస్టిక్ గా వుంటాడు. అందుకని అతన్ని కళల వైపు మళ్లిస్తే బాగుంటుంది. ఇంత తెలివిగల కుర్రవాడి తండ్రి ఎలా ఉంటాడో చూద్దామని మిమ్మల్ని రమ్మన్నాను. మీకు అభ్యంతరం లేకపోతే గనక, ఆర్ట్ స్కూలుకి మారుస్తాను"అని.

"సరే! నాకేమి ఇబ్బంది లేదు. వాడికి ఎందులో ఆసక్తి వుంటే, అందులోనే చేర్పించండి"అని చెప్పి అరుణాచలం వెళ్ళిపోయారు చలంగారు. అట్లా వసంత్ ఆర్ట్ స్కూల్లో ఆర్ట్ నేర్చుకోవడం ప్రారంభించాడు. ఆర్ట్ స్కూలు వాళ్ళు ప్రతి సంవత్సరం ఫీజులు పెంచడం మొదలుపెట్టారు. కొంత కాలానికి ఫీజు పంపించడం కష్టమై పోయింది డాక్టర్ గారికి.

పిల్లల సంగతులు కాస్సేపు ఇక్కడ ఆపి, 1940లో మళ్ళీ చలం గారి దగ్గరకు వస్తే, ఆయనకీ భగవాన్ కలలో కనిపిస్తుండేవాడు. "అలా చెప్పారు. ఇలా చెప్పారు"అనేవారు. అలాంటి రోజుల్లోనే "నీ జీవితం లోకి ఒక అద్భుతమైన స్త్రీ ప్రవేశించ బోతోంది"అని భగవాన్ కలలో కనిపించి చెప్పినట్లుగా, ఏం జరిగిందంటే, చలం గారికి తెలియకుండా, చలం

గారి ప్రమేయం లేకుండా, చలం గారి పట్ల అభిమానం పెంచుకుంటోంది ఒకామె. ఆమె ఎవరో,ఏమిటో తెలుసుకోవాలంటే, మనం పిఠాపురం వెళ్ళాలి.

పిఠాపురం సంస్థానంలో మహారాజు గారి బంధువు ఒకాయన ఉండేవాడు. అతని పేరు సూర్యారావు. ఆ సూర్యారావు గారి అమ్మాయి పేరు అబ్బాయమ్మ. ఆమెకు 8 సంవత్సరాల వయసులోనే సంగమేస్వర శాస్త్రి అనే గురువుగారి దగ్గర వీణ నేర్పించారు. కొంచెం వయసు వచ్చాక వెంకట్రావు అనే వ్యక్తి ప్రాపకం లోకి తీసుకున్నాడు. ఎందుకంటే, "పెళ్లి చేసుకోకపోతే మరణం సంభవిస్తుంది" అని జాతకంలో వుందట. అందుకని ఈ అబ్బాయమ్మను తన జీవిత సహచరిగా తీసుకున్నాడు. ఒక ఇల్లు అద్దెకు తీసుకొని, ఆ ఇంట్లో కాపురం పెట్టారు. వెంకట్రావు బాగా ధనికుడు. వాళ్లకి ఇద్దరు పిల్లలు పుట్టారు.

మనం మాట్లాడుకుంటున్న సమయానికి వాళ్ళ పిల్లల్లో పెద్ద , అమ్మాయి 15, 16 సంవత్సరాలు. అబ్బాయి చిన్న 6, 7 సంవత్సరాలు. అబ్బాయమ్మ ఎక్కువగా బయటకు వచ్చేది కాదు. ఘోషా పద్ధతిలో వుండేది. వెంకట్రావు గారు ఎప్పుడో వచ్చి, వీణ వినడం, కావలిసినవన్నీ సమకూర్చడం చేసేవాడు. ఇలా జరుగుతూవుండగా...ఈ అబ్బాయమ్మకు ఒక బాల్య మిత్రుడు వున్నాడు. అతని పేరు కూడా వెంకట్రావే. ఇతను దేవులపల్లి క్రిష్ణ శాస్త్రి గారికి మిత్రుడుకూడా. అతను ఈ అబ్బాయమ్మకు చదువుకోవడానికి పుస్తకాలు తెస్తుండేవాడు. అందులో చలంగారి పుస్తకాలు కూడా ఉండేవి. అబ్బాయమ్మ గారికి చలం పుస్తకాలు చదవగానే, ఒక కొత్త ప్రపంచం కనిపించింది. అసలు ఈ పుస్తకాలు రాసింది ఒక వ్యక్తి కాదు. ఎవరో దివ్య లోకాల నుండి వచ్చి వ్రాశారు అనుకుంటుండేది.

ఒకసారి ఆ మిత్రుడు "శశాంక" నాటకం పుస్తకం కాకుండా, రాత ప్రతి తెచ్చాడు. ఆమె విపరీతమైన ఆనందానికి గురయ్యింది. ఆ రచయిత వ్రాసిన అక్షరాల్ని చూస్తున్నాన్న ఆనందంలో, ఆ పుస్తకాన్ని పదే పదే తడిమి చూసి విపరీతమైన ఆనందానికి లోనయ్యింది. ఆ బాల్య మిత్రుడ్ని అడిగింది

"ఈ రచయితని ఒకసారి చూడాలనివుంది. మన వూరు తీసుకువస్తావా?"అని.

"ఒకవేళ మన వూరు వస్తే, మన ఇంటికి తీసుకురమ్మంటావా?"అడిగాడా మిత్రుడు.

"వద్దు...వద్దు... మా ఇంటికి తీసుకురావద్దు. నేను ఘోషా మనిషిని ఇంట్లోనుండి బయటకు రాను కదా! కనీసం మన వూరు వచ్చి, మన వీధిలోనుండి నడిపించుకొని తీసుకువెళ్ళు. నేను కిటికీ లోనుండి చూస్తాను.అంత మాత్రం అదృష్టం చాలు నాకు" అందామె.

"ఆయన అందరిలాగా బయటకు రారు. సభలకూ, సమావేశాలకూ రారు. ఎక్కువమందితో కలవరు. " అని చెప్పాడా మిత్రుడు.

ఆ సమయంలోనే అబ్బాయమ్మ భర్త వెంకట్రావు గారికి అనారోగ్యం చేసింది. మరో పక్క, అబ్బాయమ్మ చలం గారి అడ్రస్ తీసుకొని, ఉత్తరాలు రాస్తుండేవారు. ఆయన సమాధానాలు ఇస్తుండేవారు. ఇలా జరుగుతుండగా, ఆమె భర్త మరణించాడు. ఒకసారి చలం గారికి రాసిన ఉత్తరంలో "మీరు ఒకసారి పిఠాపురం రండి. మిమ్మల్ని ఒకసారి చూడాలనివుంది."అని. దానికి చలం గారు "నాకు అలా రావడం ఇష్టం వుండదు. నన్ను చూడాలని వుంటే, మీరే రండి"అని రాశారు.

సరే!ఆమె తనే వెళ్ళాలని నిర్ణయించుకొని, బెజవాడ చలం గారి ఇంటికి వచ్చింది. గత 7,8 సంవత్సరాలుగా అభిమానిస్తున్న చలం గారిని చూడగానే ఆనందాన్ని తట్టుకోలేకపోయింది. చలంగారు ధ్యానం లోనుండి బయటకు రావడం, పెద్దమ్మాయి డాక్టర్ గారికి సహాయం చేయడం, ఇవన్నీ గమనించిన ఆమెకు ఆశ్చర్యం వేసింది. ఏమిటిదంతా...ఏదో ఆశ్రమం లాగా, ముని కుమారుల్లాగా వున్నారు అనుకొంది. ఆ మొదటిసారి కలుసుకున్నప్పుడే "మిమ్మల్ని గురించి నా జీవితమంతా కలలు కన్నాను. మీకంటే, నాకు ఎవరూ లేరు. మీరు నన్ను తీసుకోండి"అనే భావం వచ్చేలాగ చెప్పింది. తర్వాత ఆమె అప్పుడప్పుడు బెజవాడ వస్తూ వుండేది.

అయితే, చలం భార్య గారికీ, డాక్టర్ గారికీ ఈమె రావడం అంతగా నచ్చలేదు. ఆమె ఘోషా స్త్రీ, డబ్బూ, హోదా గల మనిషి కాబట్టి ఏమీ అనలేకపోయారు. ఆ పరిచయం అయిన కొద్ది కాలం తర్వాత ఆమె బెజవాడ రావడం, చలంగారే ఆమె దగ్గరకు వెళ్ళడం జరిగిన రోజుల్లో చలంగరికి తెలిసిపోయింది ఆమె అభిప్రాయాలూ, తన అభిప్రాయాలూ కలవవని.

ఎందుకంటే, ఆమె అంతవరకూ నాలుగు గోడల మధ్యా పెరిగిన మనిషి. చలంగారి కుటుంబం దానికి పూర్తిగా విరుద్ధం. ఆ అబ్బాయమ్మకు ఎక్కువగా ప్రాపంచక విషయాలూ, లౌకిక విషయాల మీద ఆసక్తి వుండేది. చలం గారికి అవేమి పట్టవు. ఆయన ప్రపంచం వేరు. రచనలూ, స్త్రీలూ, పిల్లలూ వాళ్ళ బాధలూ ఇలాంటివి. ఈ అబ్బాయమ్మ "తరువాత ఏమిటి?రేపు ఏమిటి?" ఇలా ప్రణాళికలు వేస్తుండేది. చలంగారికి గానీ, అతని కుటుంబానికి గానీ రేపు గురించి ఆలోచనే ఉండేది కాదు. "ఈ రోజు జీవితం, ఈ రోజు జీవించడం" లాగే వుండేది. అబ్బాయమ్మ కు గుంభనంగా వుండడం అంటే ఇష్టం. చలం గారి పిల్లలు ఎవరి ఇష్టం వారిది అన్నట్లుగా తలో రకంగా వుండేవారు. ఇన్ని వ్యత్యాసాలు వున్నాయి వాళ్ళిద్దరి జీవనవిధానాల్లో. అయినా గానీ, "మీరు రావద్దు" అని చలం గారు చెప్పలేకపోయారు. ఇంతవరకూ ఆమెను అబ్బాయమ్మ అని అంటున్నాం. కానీ, చలం గారి జీవిత చరిత్రలో "లీల గారు"అని రాస్తారు.

ఈ 'లీల' అనే పేరు ఎందుకొచ్చిందంటే..సౌరిస్ "సుందర్"అని ఒక నాటకం రాశారు.ఆ నాటకంలో ప్రధాన పాత్ర పేరు 'లీల'. ఆ నాటకం లోని లీలపాత్రకు ఎలాంటి వ్యక్తిత్వం ఉండేలా చిత్రించారో..సరిగ్గా అబ్బాయమ్మ కూడా అలాగే కనిపించేసరికి, అందరూ ఆమెను 'లీల' అని పిలవడం ప్రారంభించారు. అందుకే చలం గారి రచనల్లో 'లీల' అనే

వుంటుంది. అలా ఆమె 1940 లో చలం గారి జీవితంలో ప్రవేశించి, ఆయన అరుణా చలం వెళ్ళేవరకూ అక్కడే వుండిపోయారు.

. అదే రోజుల్లో చలం గారికి 'భీమిలి' బదిలీ అయ్యింది. ఆయన ఎప్పుడు బదిలీ అయినా ఒక్కరే వెళ్ళేవారు. ఒక్కోసారి పిల్లల్ని తీసుకువెళ్ళేవారు. భార్య మాత్రం బెజవాడలోనే వుండేవారు. అలాగే భీమిలి కూడా సౌరీస్ నీ, నిర్మలనీ తీసుకువెళ్ళారు. లీల కూడా తన పిల్లవాడిని తీసుకొని అక్కడకు వెళ్ళింది. అక్కడే చలం గారితో 2,3 సంవత్సరాల పాటు వున్నారు. అక్కడ వున్న రోజుల్లో చలంగారి మీద విపరీతమైన "పొసెసివ్ నెస్" పెరిగిపోయింది. చలంగారు ఎక్కువగా పిల్లలతో గడపడం, పిల్లలకోసం ఆలోచించడం, సౌరీస్ తో ఎక్కువగా మాట్లాడడం, సౌరీస్ తో కలసి ధ్యానం చేయడం, భగవాన్ గురించి ఆలోచించడం, ఇవన్నీ లీల గారికి నచ్చలేదు. చలంగారు నాకోసం మాత్రమే వుండాలి. నాకు పూర్తిగా స్వాధీనం అయిపోవాలి. ఇలా ఆలోచించి, ఆ 'పొసెసివ్ నెస్' ఎక్కువగా చూపిస్తుండేవారు.

చలంగారికి అది నచ్చేది కాదు. మరి నచ్చక పోయినా, "నువ్వెళ్ళిపో!" అని చెప్పలేని బలహీనత. " నేను చేస్తున్నది తప్పు అని తెలుసు.అయినా నేను చేస్తున్నాను.ఈ బలహీనత నాకు పుట్టుకనుండి వచ్చింది" అని కూడా అనుకుంటుండే వారు.. లీలగారి పొసెసివ్ నెస్ చాలా ఇబ్బందిగా అనిపించింది. అటు చూస్తే, పిల్లల్ని చూసుకోవాలి. భగవాన్ దగ్గరకు వెళ్ళాలి. ఇటు చూస్తే, లీల గారు "నాతోనే వుండండి" అంటోంది. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా ఆయన లీల గారితో స్నేహాన్ని కొనసాగించారు.

భీమిలి లో కొన్నాళ్ళు ఉన్నాక, 1945 లో ఏలూరు బదిలీ అయ్యింది. ఏలూరు చలం గారికి చిట్టచివరి ప్రస్థానం. ఈ ఏలూరు వెళ్ళినపుడు లీలగారు పిల్లలతో సహా చలంగారి దగ్గరకు వచ్చేసి కాపురం పెట్టేసింది. ఆ పరిస్థితిని గుర్తు చేసుకుంటూ చలం గారు ఆత్మకథ లో రాసుకున్నారు. "ముఖ్యంగా ఆమె సహించలేనిది ఏమిటంటే, ఆమె కాక నా మనసులోకి ఇంకొకరిని తీసుకోవడం. పిల్లలూ, మా ఒయ్యి నాకెంతో దగ్గర. ఆమెకు ఏం అనిపించిందంటే, ఏం చేసినా, యెంత ప్రేమించినా ఈ మనిషి నా వాడు కాదు. వాళ్ళ వాడే. ఆ పిల్లలే ఎక్కువ. అతని సంసారమే ఎక్కువ.నేను వూరికే ఒక వుపకరణ మాత్రమే." అని. అలాంటప్పుడు ఆవిడ

"చూడండి చలం గారూ! నా వంటి స్త్రీ తనని కోరి వచ్చిందంటే, ఎటువంటి పురుషుడికైనా 7 th హెవెన్ లో ఉండేవాడు. మీకెక్కడా తృప్తి లేదు. శాంతి లేదు. కృతజ్ఞత లేదు."అని తిట్టింది. "ఇంత చేసినా నేను ఆవిడనుండి వేరు కాలేక పోయాను. నేను బుద్ధిగల వాడినైతే, వెంటనే ఎప్పుడైతే, వ్యత్యాసాలు కనబడ్డాయో, అప్పుడే ఆవిడకు గుడ్ బై చెప్పి వెళ్లి పోవాలి. కానీ, అదేం ఖర్మో నాకు తెలీదు. ఆమెను వదల్లేకపోయాను. ఆమెతో సంబంధమూ లేదు. ఆఖరికి మా ఇద్దరి మధ్యా ప్రేమ చూపులన్నా లేవు. ఎంత ఎడం అయినప్పటికీ ఆమెను వదల్లేను. ఆమె నన్నొదల్లేదు. ఇది వరమో, శాపమో తెలియట్లేదు. అట్లా ఎందుకయ్యానో నేనప్పుడు తెలుసుకోలేదు. ఇంకా కొన్నాళ్ళు కలిసే వున్నాం. ఇంటి దగ్గర డాక్టర్ గారికీ,

వాళ్ళకీ చాలా బాధ కలిగిస్తున్నాను. కానీ, నేను ఆ సమయంలో మనిషిగా లేను. నా ఆలోచనా శక్తంతా పోయింది. నేనూ, నా నియమాలూ, నా స్వభావాలూ, నా పద్ధతీ అంతా...ఇది వరకు చెప్పింది వేరు.ఇప్పుడు తలచుకుంటే ఏమయ్యాను వెధవని అయిపోయాను. ఎక్కడకీ, ఏవీ లేకుండా ఆ విధంగా చాలా నలిగి పోయాను. ఒదిలించు కోవాలంటే, వదిలించు కోలేను. పోవాలంటే, పోలేను. ఇదంతా వదలి ఎక్కడికన్నా వెళ్ళిపోదాం అంటే, వుద్యోగం మానెయ్యలేను. నా దగ్గర డబ్బుల్లేవు." ఇంత మానసిక సంఘర్షణ కు లోనయ్యారు. ఇవన్నీ 1945 వరకూ చలం గారి జీవితంలో జరిగిన పరిణామాలు.

1945లో అంటే, చలం గారికి 51 సంవత్సరాల వయసులో భార్య రంగనాయకమ్మగారు దాదాపు మతి భ్రమించిన స్థితిలో ఆమె ఒక్కర్తే అరుణా చలం వెళ్ళిపోయారు. అంత తీవ్రమైన పరిస్థితులు ఎలా ఎదురయ్యాయో తరువాత భాగంలో తెలుసుకుందాం... ★★★★★★★★★★

(కొనసాగింపు వచ్చేనెలలో)

అక్షరీకరణ – వి. వెంకటరావు

2019 మార్చి 26 న, ప్రసారమైన ఈ టాక్ షో ని ఇక్కడ వినవచ్చు

COMMENTS